లైక్స్ కోసం ఏదైనా రాసేస్తారు..

- మౌనీరాయ్

మిగతాది 8లో


తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

సంపుటి : 23 సంచిక : 135 | గురువారం మే 01 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5


## ఇదండీ..కబురు..




రిజల్ట్‌లో తేడా వచ్చిందో వీపు చీరేస్తా. నీకు 95 పర్సెంట్ మార్కులొస్తే.. నేను రవ్వల నెక్లెస్ కొనుక్కుంటానని మొక్కుకున్నా!



2లో

## ఆపరేషన్ కగార్ సక్సెస్.. కర్రెగుట్టలపై జాతీయ జెండా

కబురు న్యూస్,ములుగు ఏప్రిల్ 30:
తొమ్మిది రోజులపాటు కొనసాగిన ఆపరేషన్ కగార్‌లో భద్రతా బలగాలు మావోయిస్టులపై పైచేయి సాధించాయి. కర్రెగుట్టలపై మొత్తానికి పట్టు సాధించాయి. బుధవారం సాయుధ బలగాలు గుట్టలపై జాతీయ జెండాను ఎగరేశాయి. అంతేకాదు.. త్వరలో అక్కడ బేస్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

## కులగణనకు తెలంగాణ ఓ మోడల్‌గా నిలుస్తుంది: రాహుల్ గాంధీ



కబురు న్యూస్,దిల్లీ ఏప్రిల్ 30:
కేంద్ర ప్రభుత్వం చేపట్టే కులగణనకు కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. అయితే, కులగణనకు నిర్ణీత సమయం తెలపాలని కోరుతున్నామన్నారు. తెలంగాణలో చేపట్టిన కులగణన ప్రక్రియ ఇందుకు బ్లూప్రింట్‌గా నిలుస్తుందని అన్నారు. కులగణన సమనత్వం తీసుకొస్తుందని తెలిపారు. ఇది తొలి మెట్టేనని పేర్కొన్న రాహుల్.. కులగణనకు అందరి భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. కులగణనకు తెలంగాణ ఓ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు.



# తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

♦ 92.78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత ♦ ఫితాల్లో 94.26 శాతంతో బాలికల పైచేయి ♦ మహబూబాబాద్ ఫస్ట్..వికారాబాద్ లాస్ట్ ♦ ఫలితాలు విడుదల చేసిని సిఎం రేవంత్

కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 30:
తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. టెన్త్ ఫలితాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం రవీంద్రభారతిలో విడుదల చేశారు. 92.78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే 1.47 శాతం అధికంగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరిగిన పది పరీక్షలకు దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం విడుదల చేశారు. ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే ఈసారి 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. 94.26 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత కాగా.. 91.32 శాతం మంది బాలురు పాసయ్యారు. అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రైవేటు- పాఠశాలల్లో 94.21 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ఎస్ఎస్సీ బోర్డు ఇచ్చింది.పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది రెండు ప్రైవేటు- పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. ఈ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 99.29శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. వికారాబాద్‌లో అతి తక్కువగా 73.97శాతం ఉత్తీర్ణత నమోదైంది. పదో తరగతిలో ఈసారి కొత్తగా సబ్జెక్టుల వారీగా మార్కులతో పాటు గ్రేడింగ్ కూడా ఇచ్చారు. ఈ విధనంగా మార్కుల మెమోలు జారీ చేయనున్నారు. మార్కుల మెమోలపైనా సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడ్ పొందుపరిచారు విద్యార్థి పాసయ్యారా..? ఫెయిల్ అయ్యారా...? అనేది మాత్రమే ఫలితాలలో కనిపిస్తుంది. ఇంకా బోధనేతర కార్యక్రమాల (కో కరిక్యులర్ యాక్టివిటీ-స్)లో విద్యార్థులకు గ్రేడ్లు ఇస్తారు. ప్రస్తుతం సిబిఎస్ఇలో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లను ముద్రిస్తున్నారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీ-స్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రించారు.

## ‘ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం’



2లో

- తెలంగాణలో మొదటిసారిగా కులగణన చేపట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని అన్నారు.
- రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం కులగణన నిర్వహించారని తెలిపారు.
- కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన నిర్వహించాలన్న నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని వ్యాఖ్యానించారు.

కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 30:
కులగణనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయమని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. జనగణనతో పాటు కులగణన నిర్వహిస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని ఆయన అన్నారు. కేంద్ర కేబినెట్ భేటీలో కులగణనపై నిర్ణయం తీసుకున్న అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు.‘దేశ చరిత్రలో మొదటిసారిగా కులగణన నిర్వహించిన రాష్ట్రం తెలంగాణ. కుల గణన తో తెలంగాణలో ఏ కులం వారు ఎంత నిష్పత్తిలో ఉన్నారని తేల్చి చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీది. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం నిర్ణయం తీసుకొని పారదర్శకంగా కుల గణన సర్వే నిర్వహించడం జరిగింది’ అని ఆయన అన్నారు.



2లో..

## కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 30:
ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఈఎన్సీ భూక్యా హరిరామ్‌పై తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆయన్ని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ఆయనకు కోర్టు రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలులో ఉన్నారు.ఏప్రిల్ 26వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా హరిరామ్‌కు సంబంధించిన 14 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు చేసిన ఏసీబీ బృందాలు పలుచోట్ల భూములు, ఇతర ఆస్తులు ఉన్నట్టు గుర్తించాయి.

## నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం..

### సమ్మె చేయాల్సిన పరిస్థితుల్లో ఆర్టీసీ లేదు - మంత్రి పొన్నం ప్రభాకర్



2లో

కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 30:
మే 7నుంచి తెలంగాణ ఆర్టీసీ సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ సమ్మె నోటిసుపై స్పందించిన రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమ్మె నిర్ణయంపై పునరాలోచించాలని అన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చామని.. ప్రస్తుతం సమ్మె చేయాల్సిన పరిస్థితిలో ఆర్టీసీ లేదని అన్నారు పొన్నం ప్రభాకర్. ఆర్టీసీ సమస్యల పరిష్కరానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్.

## ‘జాతీయ కులగణన వ్యతిరేకి కాంగ్రెస్’



కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 30:
జాతీయ కులగణనకి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకి అంటూ కేంద్ర హెంశాఖ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కులగణన చేపట్టాలనే కేంద్ర ప్రభుత్వం కేబినెట్ లో తీసుకున్న నిర్ణయం తమ ఘనతే అని చెప్పుకుంటున్న కాంగ్రెస్‌కు బండి సంజయ్ చురకలంటించారు. ‘కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో జనాభా లెక్కల్లో కులగణనను చేర్చకపోవడమే నిదర్శనం. కులగణన చేయాలంటూ అన్ని పార్టీలు కోరినా పట్టించుకోని దుర్మార్గపు పార్టీ కాంగ్రెస్సే. మోదీ సర్కార్ నిర్ణయం కాంగ్రెస్ ఘనతేనని చెప్పడం సిగ్గుచేటు.అదే నిజమైతే డూప్లికేట్ గాంధీల ఏలుబడిలో కులగణన ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలి. దేశవ్యాప్త కులగణన మోదీ సర్కార్ ఘనతే. రాష్ట్ర ప్రభుత్వ కులగణన సర్వే అంతా తప్పుల తడకే. కేసీఆర్ సమగ్ర సర్వేకు, రేవంత్ సర్కార్ సర్వేకు పొంతన లేకపోవడమే నిదర్శనం. కేంద్ర కులగణన అత్యంత శాస్త్రీయమైది. కులాల వారీగా జనాభా ఎంతో తేలిపోతోంది. జనాభా ఆధారంగా రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుంది. రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించండి’ అని బండి సంజయ్ కోరారు.

## డిగ్రీలు వస్తున్నా..స్కిల్స్ ఉండడం లేదు

- ♦ అందుకే స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం
- ♦ న్యాక్ కార్యక్రమలో మంత్రి కోమటిరెడ్డి




2లో

కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 30:
ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి డిగ్రీ తీసుకొని బయటకు వచ్చిన యువతకు స్కిల్స్ ఉండటం లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన చెందారు. యువతలో స్కిల్స్ పెంచేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని అందు కోసమే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ న్యాక్ లోబుదవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కోమటి రెడ్డి ముఖ్య అథిదిగా హాజరయ్యారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను, సోలార్ రూఫ్ టాప్, స్పేస్ అకాడమీ డబ్బింగ్ స్టూడియో ను, సి ఎస్ ఆర్ కింద ఐసీఐసీఐ బ్యాంక్ ఏర్పాటు చేసిన 100 కె వి సోలార్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. సినిమా కోర్సులు నేర్చుకున్న 22 మంది బ్యాచ్ కు ఆయన సర్టిఫికెట్ లు అందచేశారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# కెనడాలో లిబరల్స్‌కు పట్టం




అనుకున్నట్టే అయింది. సోమవారం కెనడాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లిబరల్ పార్టీ మరోసారి విజయకేతనం ఎగరేయబోతున్నదని ఫలితాల సరళి తెలియజెబుతోంది. 343 స్థానాలున్న పార్లమెంటులో ఆ పార్టీకి పూర్తి స్థాయి మెజారిటీ వస్తుందా, లేక వేరే పార్టీల ఆసరా కావాల్సివస్తుందా అన్నది మరికొన్ని గంటల్లో తేలిపోతుంది. గత మూడేళ్లుగా అధికార లిబరల్ పార్టీ అసంతృప్తిని మూట గట్టుకుంది.ఈసారి దాని ఓటమి ఖాయమని అన్ని సర్వేలూ జోస్యం చెప్పాయి. మొన్న జనవరిలో సైతం కన్సర్వేటివ్‌ల కన్నా లిబరల్స్ 20 పాయింట్లు వెనకబడివున్నారు. ఈ దశలో అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు కావటం, ఆయన మతిమాలిన ప్రకటనలు, ఎడాపెడా సుంకాల విధింపు లిబరల్ పార్టీకి వరంలా మారాయి.ఇతరేతర సమస్యలవీ మాయమై కెనడాను అమెరికా కబళిస్తుందన్న భయాందోళనలు ఆవహించి కన్సర్వేటివ్ పార్టీని కాదని జనం ఎప్పటిలా లిబరల్ పార్టీవైపే మొగ్గు చూపారు. ప్రధాని పదవి నుంచి జస్టిన్ ట్రూడో తప్పుకోవటం కూడా లిబరల్స్‌కు కలిసొచ్చింది. ఆయన స్థానంలో గత నెల మొదట్లో ప్రధానిగా వచ్చిన మార్క్ కార్నీ చకచకా చక్రం తిప్పారు. ట్రంప్‌తో సాన్నిహిత్యమున్న కన్సర్వేటివ్ పార్టీ వస్తే దేశాన్ని అమెరికా పాదాక్రాంతం చేయటం ఖాయమన్న ప్రచారం పనికొచ్చింది. కన్సర్వేటివ్ పార్టీ జాతకం తలకిందులైంది.ప్రపంచ సంపన్న రాజ్యాల్లో ఒకటిగా, అమెరికా సన్నిహిత మిత్ర దేశంగా, వాణిజ్య భాగస్వామిగా దశాబ్దాలపాటు వెలుగులీనిన కెనడా కొన్నాళ్లుగా కష్టాల్లో కూరుకుపోయింది. అయిదేళ్ల నాడు విరుచుకుపడిన కోవిడ్ వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. జీవనవ్యయం అపారంగా పెరిగింది. నిరుద్యోగం తారస్థాయికి చేరింది. ఇళ్ల ధరలు ఆకాశాన్నంటాయి. నగరాల్లో అద్దెలు విపరీతంగా పెరగటంతో శివారు ప్రాంతాలకు జనం తరలిపోయారు. గృహ కొనుగోలుదారులు ఆ ఆలోచనను వాయిదా వేసుకున్నారు. ఇళ్లు లేని పౌరుల సంఖ్య పెరుగుతూ పోయింది. వీటన్నిటి పర్యవసానంగా పుట్టుకొచ్చిన సామాజిక అశాంతి మాదకద్రవ్యాల వాడకాన్ని ఊహించని స్థాయికి తీసుకెళ్లింది. దాంతోపాటే నేరాల సంఖ్య ఎక్కువైంది. నిజానికి ఇది కెనడాకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. సంపన్న దేశాలన్నీ ఈ మాదిరే సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి.కానీ కెనడా పౌరులు దీన్నంతటినీ లిబరల్ పార్టీ చేతగానితనంగా పరిగణించారు. గత మూడేళ్లుగా కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు పియర్ పొయ్‌లేవ్ దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం తమకే సాధ్యమని ప్రచారం చేశారు. ఆవరించిన ఈ సంక్షోభం బహుశా చాలా దేశాల మాదిరే కెనడాలో కూడా మిత వాదపక్షాన్ని అందలం ఎక్కించివుండేది.కానీ ట్రంప్ అధిక సుంకాలు విధించటం, కెనడాను 51వ రాష్ట్రంగా విలీనం చేసుకోవటం ఖాయమని తరచు చెప్పటం కన్సర్వేటివ్‌ల ఆశల్ని అడియాసలు చేసింది. పౌరుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. వారు గెలిస్తే అదే జరగొచ్చునన్న సంశయం బలపడింది. తమ సహజ వనరులు, ఆర్థిక సంపద దోచుకోవటానికి అమెరికా తహతహలాడు తున్నదని, దీన్ని నిలువరించగల పార్టీ లేకుంటే ట్రంప్ అన్నంతపనీ చేస్తారని వోటర్లు భావించారు.ఇళ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిచ్చి వాటి ధరలు దిగొచ్చేలా చేస్తామని రెండు ప్రధాన పక్షాలూ వాగ్దానం చేశాయి. కొత్త భవనాల నిర్మాణంపైవున్న ఆంక్షల్ని ఎత్తేస్తామని కన్సర్వేటివ్‌లు హామీ ఇస్తే... ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తామని కార్నీ వాగ్దానం చేశారు. అమెరికా నిజ స్వరూపం తెలిసింది గనుక ఇకపై భద్రతకు ఆ దేశంపై ఆధారపడకుండా సొంతంగా సైన్యాన్ని రూపొందించుకోవాలని రెండు పార్టీలూ ప్రతిపాదించాయి.అధిక సుంకాల విషయంలో కూడా ఆ రెండు పక్షాలదీ ఒకే మాట. కెనడా ఎగుమతుల్లో 80 శాతం అమెరికాకే చేరతాయి. అధిక సుంకాలు విధిస్తే కెనడా తీవ్రంగా నష్టపోతుంది. తాము కూడా అధిక సుంకాల ప్రక్రియ మొదలెట్టామని,దాంతో ఆ దేశం గత్యంతరం లేక చర్చలకు దిగొచ్చిందని కార్నీ చెప్పారు. అయితే కన్సర్వేటివ్‌లు ఇంత బలంగా ట్రంప్‌పై విరుచుకుపడలేకపోయారు.ఇక అధిక వలసలపై కూడా ప్రజల్లో ఆగ్రహం వుంది. లిబరల్స్ ఏలుబడిలో వలసలు పెరిగాయని వారు నమ్మారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో కొత్తగా ఖనిజాలు, శిలాజ ఇంధనాల వెలికితీతను నిలిపేయటంవల్ల ఆ రంగాల్లో ఉపాధి అవకాశాలు అడుగంటాయని, తామొస్తే దీన్ని సరిదిద్దుతామని కన్సర్వేటివ్‌లు హామీ ఇచ్చారు. నిజానికి ఈ సమస్యలే అమెరికాలో మితవాద రిపబ్లికన్ పార్టీని అందలం ఎక్కించాయి. కానీ ట్రంప్ రాకతో ఆ సమస్యలన్నీ మరుగునపడి కెనడాలోని మితవాద పక్షాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి.కార్నీ ఏలుబడిలో మనతో కెనడా సంబంధాలు మెరుగుపడతాయన్న అభిప్రాయం అందరిలో వుంది. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించే దారి దొరక్క, ఆ అసంతృప్తిని కప్పిపుచ్చటానికి ట్రూడో భారత్‌తో కోరి వైరాన్ని తెచ్చుకున్నారు. తీరా జగ్‌మీత్ సింగ్ ఆధ్వర్యంలోని ఖలిస్తానీ అను కూల న్యూడెమాక్రటిక్ పార్టీ(ఎన్‌డీపీ)కే ఈసారి దిక్కులేకుండా పోయింది. బలపడిన జాతీయ వాదం ఎన్‌డీపీని దెబ్బతీసింది. సిక్కువోటర్లు లిబరల్స్ వైపే మొగ్గారు.బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గా, కెనడా సెంట్రల్ బ్యాంక్ చీఫ్‌గా కార్నీకి ఆర్థిక రంగంలో అపార అనుభవం వుంది. దేశ ఆర్థికవ్యవస్థకు నూతన జవసత్వాలు తెచ్చేందుకు ఆయన సహజవాయు నిక్షేపాల, ఖనిజాల వెలికి తీతకు ప్రాధాన్యమిస్తారని అంచనాలున్నాయి. మొత్తానికి ఇరుగుపొరుగు దేశాల్లో మితవాదులుంటే వారిలో ఒకరికి మాత్రమే గెలుపు దక్కుతుందని... ఒకచోట మితవాదుల దూకుడు మరొక దేశ మితవాదులకు ప్రాణాంతకమవుతుందని కెనడా ఫలితం నిరూపించింది.

# 'ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం'

మొదటిపేజీ తరువాయి

### కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

దేశవ్యాప్తంగా కులగణన చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. 'భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా కులగణన జరగాల్సిందేనని తేల్చి చెప్పారు. రాహుల్ గాంధీ సూచన మేరకు తెలంగాణలో రేవంత్ రెడ్డి కులగణన చేశారు. రాహుల్ గాంధీ పోరాటం.. రేవంత్ రెడ్డి ఆలోచన విధానం వల్లనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇది కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం.. రాహుల్ గాంధీ సాధించిన విజయం. దేశ వ్యాప్తం గా ఉన్న బడుగు బలహీన వర్గాల విజయం ఇది. రాహుల్ గాంధీ పోరాటానికి భయపడే బీజేపీ ప్రభుత్వం కులగణన కోసం ముందుకు వచ్చింది. రాహుల్ , రేవంత్ దెబ్బకు కేంద్రం దిగివచ్చింది. బీసీ బిడ్డ కాకపోయినా సీఎం రేవంత్ రెడ్డి కులగణనకు ముందుకు వచ్చారు. 56.36 శాతం బీసీలు ఉన్నారని తెలంగాణలో రేవంత్ రెడ్డి లెక్క తీశారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో ప్రవేశపెడితే నేను బలపర్చాను.. అది నా అదృష్టం. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేశాం. జంతర్ మంతర్ ధర్నా కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హాజరయ్యారు. మా ధర్నాకు బీజేపీ, బీఆర్ఎస్ ఆ నాడు మద్దతు ఇవ్వలేదు. గతంలో బీఆర్ఎస్ తన రాజకీయ అవసరాల కోసం సమగ్ర కుటుంబ సర్వే చేసింది. సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేపట్టి దేశానికి మార్గదర్శనం చేశాడు. తెలంగాణ బీసీ కులగణనకు దిక్సూచిగా మారింది. కులగణన చేయకపోతే బడుగు బలహీన వర్గాల ఆగ్రహం తప్పదని బీజేపీకి అర్థమైంది. దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు వారి వాటా వారికి అందాల్సిందే. జనగణన లో కులగణన పకడ్బందీగా నిర్వహించి రిజర్వేషన్లను చట్టబద్ధం చేయాలి' అని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# ఆపరేషన్ కగార్ సక్సెస్.. కర్రెగుట్టలపై జాతీయ జెండా

మొదటిపేజీ తరువాయి

కర్రెగుట్ట అటు ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పరిధిలో.. ఇటు ములుగు వాజేడు మండలం పరిధిలో విస్తరించి ఉన్నాయి. ఆపరేషన్ కగార్‌లో భాగంగా 10 వేలకు పైగా సాయుధ బలగాల సిబ్బందితో కర్రెలగుట్టను చుట్టుముట్టారు. డ్రోన్‌లు, హెలికాప్టర్‌లతో కూంబింగ్ కొనసాగించారు. ఈ క్రమంలో జరిగిన ఎదురు కాల్పుల్లో పలువురు మావోయిస్టులు మరణించిన సంగతీ తెలిసిందే.డీఆర్‌జీ బస్తర్ ఫైటర్, కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ సైనికులు ఈ కూంబింగ్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలో రాయ్‌పూర్ నుంచి ఆపరేషన్‌ను పర్యవేక్షించిన ఐబీ చీఫ్ ఇవాళ నేరుగా కర్రెలగుట్టకు చేరుకున్నట్లు సమాచారం. ఇప్పటిదాకా ఆపరేషన్‌లో పాల్గొన్న టీం మొత్తాన్ని వెనక్కి రప్పించి.. అక్కడికి కొత్త టీంను మోహరింపజేయనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే త్వరలో సీఆర్‌పీఎఫ్ అక్కడ బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేయనుంది. ఇటు తెలంగాణ, అటు ఛత్తీస్‌గఢ్‌లకు ఉపయోగపడేలా ఈ బేస్ ఉండనున్నట్లు సమాచారం.

# కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

మొదటిపేజీ తరువాయి

ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.250 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలను పరిశీలిస్తున్నారు.

హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ గృహాలు, షేక్‌పేటలో ఒక విల్లా, కొండాపూర్‌లో ఒక విల్లా, మాదాపూర్‌లో ఒక ఫ్లాట్, నార్సింగిలో ఒక ఫ్లాట్, అమరావతిలో ఒక వాణిజ్య స్థలం, మర్కూక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, బొమ్మలరామారంలో 6 ఎకరాల్లో మామిడి తోటతో కూడిన ఫామ్ హౌస్, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం, కుత్బుల్లాపూర్‌లో, మిర్యాలగూడలో స్థలాలు ఉన్నట్టు కీలక ఆధారాలను అధికారులు సేకరించారు.

# డిగ్రీలు వస్తున్నా... స్కిల్స్ ఉండడం లేదు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కోమటి రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగుమే పెద్ద సమస్యగా మారిందని, ఉద్యోగాలు లేక యువత మాదక ద్రవ్యాలకు బానిస అవుతుందని అన్నారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనేందుకు యువతకు వివిధ రంగాలలో స్కిల్ యూనివర్సిటీ- శిక్షణ ఇస్తుందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కి సీఎం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహిళలకు ఇళ్ళ నిర్మాణంలో మెస్త్రి ట్రైనింగ్ ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ళ స్కీమ్ కింద చేపట్టే నిర్మాణాలు వారితోని చేయిస్తున్నామని కోమటిరెడ్డి అన్నారు. సినిమా టెక్నీషియన్ కు న్యాక్ లో శిక్షణ ఇస్తామని ఈ విషయంలో త్వరలో దిల్ రాజు , సినిమా వాళ్ళ తో సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్నారు. నల్గొండ లో స్కిల్ -ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు- చేశామని ప్రతి ఏటా 10 వేల మందికి -ట్రైనింగ్ ఇస్తూ 100 శాతం జాబ్ ప్లేస్ మెంట్ కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. న్యాక్ ఎండి ఆర్ అండ్ బి స్పెషల్ సెక్రటరీ హరిచందన మాట్లాడుతూ స్కిల్ - ట్రైనింగ్ అనేది డిగ్రీ కాదని ఇది ఒక కోర్స్ అనే విషయం గమనించాలని నిత్యం స్కిల్స్ నేర్చుకుంటూ ఉండాలని అన్నారు. గత ఏడాది లో వివిధ కోర్స్ లో 25 వేల మందికి ట్రైనింగ్ ఇచ్చామని ఈ సంఖ్య ను రానున్న రోజుల్లో పెంచు తమని హరిచందన అన్నారు. ఇందులో 99 శాతం మందికి పెద్ద కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో 10 ఉమ్మడి జిల్లా లో న్యాక్ రీజనల్ కేంద్రాలు కూడా ఏర్పాటు- చేశామన్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల కు చెందిన వాళ్ళు న్యాక్ లో శిక్షణ తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఐసీఐ బ్యాక్ అధికారులు పాల్గొన్నారు.

# నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం..

మొదటిపేజీ తరువాయి

ఆర్టీసీ కార్మికుల పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని.. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, ఆర్టీసీ పరిరక్షణ అంశాలపై కట్టుబడి ఉన్నామని అన్నారు. గత పదేళ్ళలో ఆర్టీసీలో పెండింగ్ పీఎఫ్ బకాయిలను తగ్గించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు.సమ్మెపై ఇప్పటివరకు శాఖ మంత్రిగా తనను ఎవరూ కలవలేదని.. డైరెక్ట్ గా లేబర్ కమిషన్ ను కలిసి నోటీస్ అందజేశారని అన్నారు. ఉద్యమకారుడిగా తనకు ఆర్టీసీతో ప్రత్యేక అనుబంధం ఉందని.. ఆర్టీసీ కార్మికులతో సమాలోచనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు పొన్నం ప్రభాకర్. సమ్మెకు పోవడం వల్ల ఇబ్బందులు వస్తాయని...ఆర్టీసీ రెండు ప్రధాన అంశాలు ముఖ్యమంత్రి నోటీసులో ఉన్నాయని.. వాటిని కూర్చొని మాట్లాడుకుంటామని అన్నారు.ఇది సమ్మెకు పోయే కాలం కాదని.. ఆర్టీసీ శ్రేయస్సు దృష్ట్యా ఇది సమ్మె సమయం కాదని అన్నారు పొన్నం ప్రభాకర్. రూ. 1562 కోట్ల పీఎఫ్ కాయలను 600 కోట్లకు తగ్గించామని.. సిసిఎస్ బకాలను పూర్తిగా తగ్గించేసామని అన్నారు. రిటైర్మెంట్ అయిన రోజే వారి బెనిఫిట్స్ ఇచ్చేలా కార్యాచరణ చేస్తున్నామని అన్నారు. సంస్థ నిలబడాలని.. ఆర్టీసీ 40,000 కుటుంబాలు బాగుపడాలని కోరుకునే ప్రభుత్వం తమదని అన్నారు.

# ఇస్కాన్ నేత చిన్మయ్ కృష్ణదాస్‌కు బెయిల్

బంగ్లాదేశ్‌లో దేశద్రోహం కేసులో అరెస్ట్ అయిన హిందూ నేత చిన్మోయ్ కృష్ణ దాస్‌కి బంగ్లాదేశ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇస్కాన్ మాజీ నాయాకుడు, బంగ్లాదేశ్ సమ్మిలిత్ సతానత జాగ్రన్ జోట్ ప్రతినిధి అయిన దాస్‌ని నవంబర్ 25న ఢాకా ఎయిర్ పోర్టులో అక్కడి అధికారులు అరెస్ట్ చేశారు. బంగ్లాదేశ్ జెండాను అవమానించారనే కారణంగా అతడిపై దేశద్రోహ కేసు నమోదు చేశారు. తాజాగా, ఆయనకు జస్టిస్ ఎండీ అటోర్ రెహమాన్, జస్టిస్ ఎండీ అలీ రెజాలతో కూడిన ధర్మాసనం బెయిల్‌ని మంజూరు చేసింది. గతేడాది ఆగస్టులో విద్యార్థుల హింసాత్మక ఉద్యమం తర్వాత షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి భారత్ పారిపోయి వచ్చారు. ఆ తర్వాత, బంగ్లాదేశ్‌లో మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అయితే, షేక్ హసీనా గద్దె దిగిన తర్వాత, బంగ్లా వ్యాప్తంగా మైనారిటీ-లు, ముఖ్యంగా హిందువులు టార్గెట్‌గా దారుణమైన హింస చెలరేగింది. హిందువుల ఇళ్లు, ఆస్తులు, వ్యాపారాలు, గుడులను మతోన్మాదులు టార్గెట్ చేసి దాడులకు పాల్పడ్డారు. ఆ సమయంలో ఈ హింసకు వ్యతిరేకంగా చిన్మోయ్ కృష్ణ దాస్ మైనారిటీల హక్కుల కోసం నినదించారు. ఈ నేపథ్యంలో అతడిని సైలెంట్ చేసేందుకు యూనస్ సర్కార్ దేశద్రోహ కేసు పెట్టింది. పలు సందర్భాల్లో అతడి బెయిల్‌ని కింది కోర్టులు తోసిపుచ్చుతూ వచ్చాయి. అతడి తరుపున వాదించడానికి కూడా లాయర్ రాని పరిస్థితి నెలకొంది. ముస్లిం బార్ అసోసియేషన్ అతడి తరుపున వాదించవద్దని హెచ్చరికలు కూడా జారీ చేసింది. నవంబర్ 27న చట్టోగ్రామ్(చిట్టగాంగ్) కోర్టు వెలుపల దాస్ అనుచరులు, అధికారులకు మధ్య హింసాత్మక ఘర్షణ జరిగింది. ఇందులో ఒక న్యాయవాది మరణించారు. అతడి అరెస్ట్‌పై భారత్ కూగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటన రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడానికి కారణమైంది.

# సిఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

### అభినందనలు తెలిపిన మాజీ సిఎస్ శాంతికుమారి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. రామకృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సిఎస్ శాంతి కుమారి పదవీవిరమణ చేయడంతో.. రామకృష్ణారావును ప్రభుత్వం నూతన సిఎస్ గా నియమించింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వచ్చే ఆగస్టులో ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఆయన తన సర్వీసులో నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్‌గా, 2016 నుంచి ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. 2021 నుంచి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కుడ్లిగి రామకృష్ణారావు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సిఎస్ శాంతికుమారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. కొత్త సిఎస్‌కు ఆమె అభినందనలు తెలిపారు.

# ప్రధాని మోడీ రష్యా పర్యటన రద్దు

### విక్టరీ వేడుకల్లో పాల్గొనడం లేదని వెల్లడి

ప్రధానమంత్రి మోదీ రష్యా పర్యటన రద్దయ్యింది. మే నెలలో రష్యా నిర్వహించనున్న విక్టరీ డే వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనడం లేదని వెల్లడైంది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రకటించింది. భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ మాస్కో పర్యటనకు మోదీ వెళ్లడం లేదని తెలుస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా విక్టరీ డేపేరుతో రష్యా ఏటా వేడుకలు జరుపుతుంది. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో మే 9న భారీ స్థాయిలో సైనిక కవాతు నిర్వహిస్తారు. 80వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మిత్ర దేశాధినేతలను పుతిన్ ఆహ్వానించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి మోదీకి ఆహ్వానం అందింది. ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# సాయి కుటుంబానికి అండగా ఉంటాం

జనగామ పట్టణం 21వ వార్డు కుర్మవాడకు చెందిన పర్శ మల్లయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు సాయికి మెరుగైన వైద్య పరీక్షలతో పాటు కుటుంబానికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) భరోసా కల్పించింది. 'నా కొడుకును సంపేయండి' అంటూ ఈనెల 29న సాక్షిలో ప్రచురితమైన కథనం మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది.సీఎంఓ ఆదేశాల మేరకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఉత్తర్వులను అనుసరించి జనగామ ఆర్డీఓ గోపీరామ్, మున్సిపల్ కమిషనర్ సాయి తల్లిదండ్రులు ఉంటున్న నివాసం, ఆర్థిక పరిస్థితులపై కలెక్టర్‌కు రిపోర్టు చేశారు. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న సాయిని నిమ్స్‌కు తరలించి, మెరుగైన వైద్య పరీక్షలు అందించే విధంగా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బాధితుడికి ఉన్న స్థలంలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా నివేదిక తయారు చేసి అందించాలని ఆదేశించారు.రాజీవ్ యువవికాసం పథకం ద్వారా బాధిత కుటుంబానికి జీవనోపాధి కల్పించే విధంగా చూస్తామన్నారు.బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుండటంతో కాలనీ వాసులు అభినందించారు. కాగా, సాయి తల్లిదండ్రులకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హామీఇచ్చారు. అలాగే సాయి ఆరోగ్య పరిస్థితులపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరాతీశారు.

# 5.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి...**
**- వీ.సీ ద్వారా కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్,తుమ్మల సమీక్ష...**





**కబురు న్యూస్,కలెక్టరేట్,నిజామాబాద్,ఏప్రిల్ 30 :** జిల్లాలో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు.యాసంగి ధాన్యం సేకరణపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్ తో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి గురించి కలెక్టర్ మంత్రి ఉత్తమ్ కుమార్ దృష్టికి తెచ్చారు. యాసంగిలో జిల్లాలో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 5.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. ఇందులో 5.34 లక్షల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం సేకరణ జరిగిందని, దొడ్డు రకం ధాన్యం 40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు. మే చివరి వారం నాటికి లక్ష్యం మేరకు పూర్తిస్థాయిలో 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 700 పైచిలుకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతోందని అన్నారు.ఇంకనూ లక్షన్నర మెట్రిక్ టన్నుల వరకు సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలు ఉన్నాయని మంత్రుల దృష్టికి తెచ్చారు.ఇతర రాష్ట్రాల ధాన్యం జిల్లాకు రాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామని,ముఖ్యంగా జిల్లాకు ఆనుకుని ఉన్న మహారాష్ట్ర సరిహద్దులో మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచామని,గన్నీ బ్యాగులు వంటి వాటి కొరత లేదని అన్నారు.ప్యాడీ క్లీనర్లు, టార్పలిన్లు,తూకం యంత్రాలు సరిపడా ఉన్నాయని వివరించారు.ప్రతి కేంద్రంలోనూ సన్న ధాన్యం నిర్ధారణకు గ్రెయిన్ క్యాలీపర్లు వినియోగిస్తున్నారని తెలిపారు.సేకరించిన ధాన్యానికి సంబంధించి వెంటదివెంట రైతుల ఖాతాలలో బిల్లులు జమ చేస్తున్నామని,ఇప్పటివరకు రూ. 875 కోట్ల మేరకు బిల్లుల చెల్లింపులు జరిగాయని కలెక్టర్ వివరించారు.అయితే సన్నలకు సంబంధించిన బోనస్ డబ్బులు మంజూరు కావాల్సి ఉందని అన్నారు.రైస్ మిల్లుల వద్ద,కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ కూడా ధాన్యం తూకంలో తరుగు పేరిట కోతలు అమలు చేయకుండా పక్కాగా పర్యవేక్షణ జరుపుతున్నామని అన్నారు.కొనుగోలు కేంద్రాల నుండి నిర్ధారిత రైస్ మిల్లులకు వెంటవెంటనే ధాన్యం తరలించేలా సరిపడా సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,ఈసారి యాసంగిలో దేశంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యం సాగు అయ్యిందని అన్నారు.54.89 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా,137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు.ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ధాన్యం సేకరణకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.ఎక్కడ కూడా రైతులు ధాన్యం అమ్మకం విషయంలో ఇబ్బంది పడకుండా చూడాలని, ముఖ్యంగా లారీలు,హమాలీల కొరత తలెత్తకుండా పోలీస్, రవాణా శాఖలతో సమన్వయాన్ని పెంపొందించుకుని ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు.రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు సకాలంలో అందించేలా చూడాలని,మిల్లుల సామర్ధ్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో ధాన్యం నిల్వలను కేటాయించాలని సూచించారు.మిల్లర్లు ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా గిడ్డంగులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అకాల వర్షాల వల్ల ధాన్యం నిల్వలు తడిసిపోకుండా వాతావరణ పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి అధికారులు,సిబ్బంది ముందస్తుగానే రైతులకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేసేలా చూడాలన్నారు.మరో రెండు,మూడు వారాల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగనున్న దృష్ట్యా,ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా సాఫీగా కొనుగోళ్లు పూర్తయ్యేలా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు.వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ సాయాగౌడ్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్,డీఎస్ఓ అరవింద్ రెడ్డి,డీసీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపేట్ లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన పోచారం





**కబురు న్యూస్ బాన్సువాడ ఏప్రిల్ 30** బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని బుధవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో అభినందనీయమని, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. విద్య ద్వారానే సమాజం మారుతుందని ప్రతి ఒక్కరు తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పినట్లైతే సమాజంలో ఉన్నత స్థానానికి ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘ సభ్యులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కాసుల రోహిత్ ను శాలువా జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసుల రోహిత్, ఉద్దేర హన్మాండ్లు, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, నారాయణరెడ్డి, సాయి రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ఎజస్,బంగారు మైసయ్య, నెర్రే నర్సింలు, పండరి, బండి సాయిలు, నేమానీ బుజ్జి, అంబేద్కర్ సంఘ సభ్యులు శివయ్య, భూమయ్య, సాయిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాంత చారి మెమోరియల్ అవార్డు అందుకున్న సుధాకర్ చారి..



**కబురు న్యూస్,బోధన్ ఏప్రిల్ 30..** తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక భూమిక పోషించిన వారికి తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నింగి నేల మేముసైతం ఆద్వర్యంలో శ్రీకాంత చారి మెమోరియల్ అవార్డులను ప్రధానం చేశారు. హైదరాబాద్ నగరంలోని మల్లారెడ్డి గార్డెన్ లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, జేఏసీ నాయకుడు, బోధన్ పట్టణానికి చెందిన మారోజు సుధాకర్ చారి కి శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనా చారి నిర్వాహకులు దరువు అంజన్న, అరుణ ల చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మారోజు సుధాకర్ చారి మాట్లాడుతూ ఈ అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యమ గుర్తులను యాదిచేసుకున్నట్లయిందని, ఈ అవార్డు నాకు మరింత భాధ్యతను పెంచిందని, ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు శ్రమిస్తానని అన్నారు. నాకు అవార్డు అందజేసినందుకు గాను ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# పది ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రభంజనం

**-600 మార్కులకు గాను 580కి పైగా ఐదుగురు**
**-570కి పైగా 16 మంది**
**-500కి పైగా 192 మంది**
**-100% ఉత్తీర్ణత**




**కబురు న్యూస్ నిజామాబాద్ స్పోర్ట్స్ ఏప్రిల్ 30** న జామాబాద్ నగరంలోని ఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారని ఎస్ఆర్ జోనల్ ఇంచార్జీ ప్రణీత్ తెలిపారు.ఎస్ ఆర్ పాఠశాల విద్యార్థులందరూ 100 శాతం ఉత్తీరత సాధించారని ఆయన తెలిపారు. 600 మార్కులకు గాను 580కి పైగా ఐదుగురు విద్యార్థులు,570కి పైగా 16 మంది విద్యార్థులు,560కి పైగా 58 మంది విద్యార్థులు, 500కి పైగా 192 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు.ఈ విజయం వెనకాల పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల కృషి ఫలితమే అని కొనియాడారు. పటిష్టమైన పాఠ్య ప్రణాళిక,నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత బోధించడం వల్ల ఈ విజయం సాధించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఇంతటి ఘన విజయం అందించిన విద్యార్థులకు,తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ఇషాక్,మేరీ,సరళ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ అరబిందో పాఠశాలలో ఉత్తమ ఫలితాలు




**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 30 :** నిజామాబాద్ నగరంలోని శ్రీ అరబిందో పాఠశాల విద్యార్థులు 10 ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ లింగారెడ్డి అన్నారు.పాఠశాల ఉపాధ్యాయ బృందం కృషితో విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించారని అన్నారు.అందులో భాగంగానే అరవింద పాఠశాలకు సంబంధించిన విద్యార్థులలో 22 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని తెలిపారు.100 శాతం ఉత్తీర్ణత వచ్చిందని,ఉత్తీర్ణత సాధించుటకు విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారని అన్నారు.600 మార్కులకు గాను టి.శివరాజ్ 556,జే.మనస్విని 555,జీ.స్వాతి 553 సాధించారని, మిగతా విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని అన్నారు.


# స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కాకతీయ ఒలంపియాడ్ విద్యార్థిని కృతి

**- 596/600 మార్కులు సాధించిన కృతి...**




**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 30 :** పదో తరగతి ఫలితాల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ (కేవోస్) విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రభంజనం సృష్టించారు.పాఠశాలకు చెందిన ఎస్.కృతి 596 ఎస్ఎస్సి మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది.బుధవారం వెలువడిన ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు ఛైర్పర్సన్ విజయలక్ష్మి తెలిపారు.596 మార్కులతో స్టేట్ ఫస్ట్ కేవోఎస్ విద్యార్థిని కృతి పదో తరగతి ఫలితాల్లో 596 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు కైవసం చేసుకుంది.హిందీ మినహా మిగతా అన్ని సబ్జెక్టుల్లో నూటికి నూరు శాతం గ్రేడ్ పాయింట్లు సాధించి స్టేట్ టాపర్ గా నిలిచింది.ఈ సందర్భంగా విద్యార్థినిని కాకతీయ యాజమాన్యం అభినందించింది.రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించి విద్యాసంస్థకే కాకుండా జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిందని డైరెక్టర్లు రామోజీరావు,తేజస్విని,రాజా కొనియాడారు.అనంతరం విద్యార్థిని కృతి మాట్లాడుతూ,కేవోఎస్ స్కూల్ అందించిన ఉత్తమ విద్యతోనే తాను స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించగలగానని తెలిపింది.ప్రతి సబ్జెక్టులో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని వివరించింది.డైరెక్టర్లు రామోజీ,డైరెక్టర్ తేజస్విని ప్రత్యేక చొరవ తీసుకుని ప్రతి విద్యార్థి రాణించేలా వెన్నంటి ప్రోత్సహించారని తెలిపింది.అంతేకాకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని చెప్పింది.అందరి కృషి వల్లే తాను మొదటి ర్యాంకు సాధించినట్లు వెల్లడించింది.రాష్ట్రస్థాయిలో కేవోఎస్ మరిన్ని ర్యాంకులు కేవోఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మరిన్ని ర్యాంకులు సాధించారు.నితీష్ (591 మార్కులు),ఎస్ఎన్వి.అఖిల్ (590), డి.కృతి(587),సాయి శ్రేయస్,వర్షిని(586),ఆదిబా సిద్ధికి, గౌతం (585),జశ్వంత్ (584),అస్త గౌర్ (583),భవాని,యోచన (582) మార్కులతో రాష్ట్ర స్థాయిలో మెరిశారు.ఈ సందర్భంగా వీరిని కాకతీయ యాజమాన్యం అభినందించింది.

# బోధన్ మాతృశ్రీ విద్యార్థుల ఉత్తమ ప్రతిభ




**కబురు న్యూస్,బోధన్,ఏప్రిల్ 30 :** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని మాతృశ్రీ విద్యాసంస్థల విద్యార్థులు 10వ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు.బుధవారం వెలువడిన ఫలితాలలో శ్రీనిధి 584 మార్కులు,ప్రతీక్ భగత్ 584,వైభవి 583,మిఫ్రా ఫాతిమా 583,కౌశిక్ కళ్యాణ్ 583,సాయి ప్రసన్న 582,ధరనేశ్వర్ 582,స్వీకృతి 581,తేజశ్రీ 581,అకృతి 580 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ దిగంబర్ విద్యార్థులు కనబరిచిన ఉత్తమ ప్రతిభ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ,విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు



**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,ఏప్రిల్ 30 :**



జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు నిర్వహించారు.కలెక్టరేట్లో ఐడిఓసి సమావేశ మందిరములో నిర్వహించిన వేడుకలకు అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీమతి బి. స్రవంతి మరియు జిల్లా సహాయ వెబత అభివృద్ధి అధికారి శ్రీ పి. నర్సయ్య మరియు శ్రీ సి గంగాధర్ మరియు లింగాయత్ వర్గం నుండి శ్రీ వి.చంద్రశేఖర్,మరియు శ్రీ యల్. బసవన్న మరియ బి. రాజ్కుమార్ మరియు బుస్స అంజనేయులు గారు, మాయావర్ రాజేశ్వర్ తదితర బిసి నాయకులు మరియు వసతి గృహ సంక్షేమాధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాలలో ఇందూర్ విద్యార్థుల ప్రభంజనం...


**కబురు న్యూస్,బోధన్ ఏప్రిల్ 30..**




పదవ తరగతి ఫలితాలలో ఇందూర్ హై స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఉత్తమ ఫలితాలకు మారుపేరుగా అంచలంచలుగా అన్ని రంగాల్లో ముందుకు దూసుకు వెళుతున్న తమ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో డివిజన్ లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని పాఠశాల వ్యవస్థాపకులు కొడాలి కిషోర్ పేర్కొన్నారు. టి.సంజన 588/600, ఎం.ఐశ్వర్య 582/600. సాధించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యను అందించడం లక్ష్యంగా పాఠశాల ముందుకు సాగుతుందన్నారు. అంతేకాకుండా అన్ని రంగాల్లో విద్యార్థులను ముందంజలో ఉంచడమే మా లక్ష్యం అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు,విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## డివిజన్ స్థాయి మొదటి ర్యాంకు సాధించిన వాసవి పాఠశాల విద్యార్థిని

**కబురు న్యూస్ బాన్సువాడ ఏప్రిల్ 30**







బాన్సువాడ పట్టణంలోని వాసవి పాఠశాల పదవ తరగతి విద్యార్థిని సహస్ర 576 మార్కులు సాధించి డివిజన్ స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. 565 మార్కులు జోహా తహరిన్, పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు 540 మార్కులకు పైగా, 21 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించడంతో పాఠశాల యాజమాన్యం నాగరాజు, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి శ్వేత, విజయకుమార్, సంతృప్తి వ్యక్తం చేశారు.

## నగర శివారు ప్రాంతాల్లో పర్యటించిన నుడా చైర్మన్ కేశ వేణు




**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 30 :**
నగరంలోని శివారు ప్రాంతాల్లో నుడా చైర్మన్ కేశవేణు బుధవారం పర్యటించారు.ఈ సదర్భంగా వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం తీవ్రమైన సమస్యగా మారే అనేక లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.ఇది చాలా మంది నివాసితుల జీవితాలను ప్రభావితం చేస్తుందని,ఈ సమస్యలను పరిష్కరించడానికి ఈ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి రూ.100 కోట్ల అంచనా బడ్జెట్ ప్రతిపాదించబడిందని అన్నారు.ఈ వర్షాకాలంలో వీలైనన్ని ఎక్కువ పనులను పూర్తి చేయాలని,మిగిలిన లేదా పెండింగ్ పనులు వచ్చే వర్షాకాలం నాటికి పూర్తిగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఆయన వెంట మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీ మనోహర్ రెడ్డి,ఏఈ వాజిద్ ఖాన్,రషీద్ ఖాన్ ఉన్నారు.

# శ్రీ విజయసాయి విద్యార్థుల విజయఢంకా



**కబురు న్యూస్,బోధన్,ఏప్రిల్ 30 :**
10వ తరగతి పరీక్షా ఫలితాలలో నీ జామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శ్రీ విజయసాయి ఉన్నత పాఠశాల మరోసారి తన ప్రతిభను చాటి విజయఢంకా మ్రోగించింది.600 మార్కులుకు గాను శ్రీనిధి,ప్రతీక్ భగత్ లు 584 మార్కులు సాంధించారు.వైష్ణవి,మిశ్రా ఫాతిమా,కౌశిక్ కళ్యాణ్ కు 583 మార్కులు,582 మార్కులు ఇద్దరికి,581 ఇద్దరికి,580 మార్కులు ఇద్దరు విద్యార్థులు సాధించారు.అన్ని సబ్జెక్టులలో A1గ్రేడులు 33 మంది విద్యార్థులు సాధించారు.ఈ సందర్బంగా బుధవారం వెలువడిన ఫలితాలలో పాఠశాల 100శాతం ఉత్తీర్ణత సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణ మోహన్ తెలిపారు.ఇంతటి ఘన విజయం సాధించడానికి కారకులైన ఉపాధ్యాయులకు,తల్లి దండ్రులకు అభినందనలు తెలుపుతూ విజయం సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



# ఎల్.ఆర్.ఎస్ రిబేటు సదుపాయం గడువు మరో మూడు రోజులు పొడిగింపు

- మే 3 వరకు చెల్లింపులకు అవకాశం...
- సద్వినియోగం చేసుకోవాలని కోరిన కలెక్టర్...

**కబురు న్యూస్,నిజామాబాద్,ఏప్రిల్ 30 :**
అనధికార లే ఔట్ల క్రమబద్దీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ సదుపాయాన్ని మరో మూడు రోజుల పాటు పొడిగించిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.ఏప్రిల్ 30వ తేదీ నాటితో ఈ గడువు ముగియగా,ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఎల్.ఆర్.ఎస్ గడువును మే 3వ తేదీ వరకు పొడిగించిందని అన్నారు.జిల్లాలోని అర్హులైన వారందరూ ఈ వెసులుబాటును సద్వినియోగం



చేసుకోవాలని సూచించారు.ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్ కు దరఖాస్తు చేసుకున్న వారందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని తెలిపారు.రుసుము ఎంత అనేది దరఖాస్తుదారులు తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయి పరిశీలించుకోవచ్చని సూచించారు.ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు మే 3వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు.వివిధ కారణాల వల్ల రెగ్యులరైజేషన్ చేసుకోలేకపోయిన వారి కోసం మరో అవకాశం కల్పిస్తూ రాయితీ సదుపాయం గడువును ప్రభుత్వం మరో మూడు రోజుల పాటు పొడిగించిందని అన్నారు.అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు ఉందని,ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.క్రమబద్ధీకరించని భూములలో రిజిస్ట్రేషన్లకు,నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు మంజూరు చేయబడవని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఆర్మూర్ నారాయణ విద్యార్థుల ప్రభంజనం

**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 30 :**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని నారాయణ పాఠశాల పదవ తరగతి ఫలితాలలో నారాయణ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల ప్రిన్సిపల్ రజని కుమారి తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో మార్కుల పరంగా చూస్తే,డి.రాఘవేంద్ర 589 మార్కులు సాధించి ఆర్మూర్ డివిజన్ లోనే ప్రథమ స్థానంలో నిలిచారని,బి.సాన్వి 583 సాధించిన రెండవ స్థానంలో నిలిచిందని తెలపారు.మొత్తం 44 విద్యార్థులు ఉండగా అందులో580 కి పైగా 6 మంది విద్యార్థులు,570కి పైగా 8 మంది విద్యార్థులు, 560 కి పైగా 7 మంది విద్యార్థులు,550కి పైగా 8 మంది విద్యార్థులు,540 కి పైగా 4 మంది విద్యార్థులు,530కి పైగా 21 మంది విద్యార్థులు,520కి పైగా ముగ్గురు




విద్యార్థులు మిగిలిన విద్యార్థులంతా ప్రథమ శ్రేణిలో పాసై ఆర్మూర్లోనే కొత్త రికార్డులను సృష్టించారని తెలిపారు.ఈ వేడుకలలో పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి ,డీజీఎం రమణ రెడ్డి,ఏజీఎం శివాజీ పటేల్ లు మాట్లాడుతూ,పదవ తరగతి రెండవ బ్యాచ్ లోనే ఇంత అద్భుత మైన ఫలితాలను అందించడానికి సహకరించిన తల్లిదండ్రులకు విద్యార్థులకు కృతజ్ఞతలు




తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోనే రెండవస్థానంలో నారాయణ విద్యార్థులు నిలిచినందుకు గాను వర్షం వ్యక్తం చేశారు.రాబోయే సంవత్సరంలో కూడా ఇంతకంటే అద్భుత మైన ఫలితాలను అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల బృందం,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో విక్టరీ హై స్కూల్ మెరిసింది

**కబురు న్యూస్, డిచ్ పల్లి,ఏప్రిల్ 30 :**

పదవతరగతి ఫలితాల్లో డిచ్ పల్లి మండల కేంద్రానికి చెందిన విక్టరీ హై స్కూల్ విద్యార్థులు మండల్లో 1వ మరియు 2వ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ సుజా,సురేష్,ఉష,గంగాధర్ లు తెలిపారు.సిరి చందన 584 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా,అక్షిత 571 మార్కులతో 2వ స్థానంలో నిలిచిందన్నారు.ఆకట్టుకునే విధంగా,43 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా స్కోర్ చేసి,100% ఉత్తీర్ణత శాతం సాధించారని అన్నారు.విద్యార్థుల ప్రతిభ మరోసారి చాటారని అభినందించారు..




# నెల్లూరు జిల్లాలో కారు బీభత్సం

**కబురు న్యూస్, నెల్లూరు ,ఏప్రిల్ 30 :**
నెల్లూరు జిల్లా కోవూరు మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పోతిరెడ్డిపాలెం వద్ద ఓ ఇంట్లోకి కారు దూసుకెళ్లడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ముంబయి జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్‌బంకు వద్దకు రాగానే అదుపుతప్పిన కారు ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆ ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. తరవాత వారు చికిత్స పొందుతూ మృతి చెందారు. వీరంతా నారాయణ వైద్యకళాశాల విద్యార్థులని తెలిసిది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బుచ్చిరెడ్డి పాలెంలో తమ స్నేహితుడి సోదరి నిశ్చితార్థానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దీంతో స్థానికులు పోలీసులు, 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నెల్లూరులో చికిత్స పొందుతూ ఐదుగురు వైద్య విద్యార్థులు సైతం ప్రాణాలు కోల్పోయారు. మృతులను అభిషేక్ రాజ్ (అనంతపురం జిల్లా), జీవన్ చంద్రారెడ్డి (నెల్లూరు), యజ్ఞేశ్ (ప్రకాశం), నరేష్ నాయక్ (అనంతపురం), అభిశశి పురుషోత్తం( తిరుపతి), మరో విద్యార్థి నవనీత్ శంకర్ (కడ) ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వీరంతా నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సెకండ్ ఇయర్ చదువుతున్నట్లు సమాచారం. నెల్లూరు జిల్లాలో కారు ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఐదుగురు వైద్య విద్యార్థులు, మరో వ్యక్తి మరణించడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

# పెండింగ్ సాదాబైనమా దరఖాస్తులకు మోక్షం

- 30 రోజులలో భూమి మ్యూటేషన్ దరఖాస్తుల పరిష్కారం...
- రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు...
- పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం...
- అవగాహన సదస్సులలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...












**కబురు న్యూస్,నిజామాబాద్,ఏప్రిల్ 30 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా పెండింగ్లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం కానున్నాయని,రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు.బుధవారం నవీపేట్, జక్రాన్పల్లి మండల కేంద్రాలలోని రైతు వేదికలలో వేర్వేరుగా నిర్వహించిన సదస్సులలో భూభారతి చట్టంపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,భూ సమస్యలు పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి భరోసా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం -2025 తెచ్చిందని తెలిపారు.ఈ చట్టం ప్రకారం భూ సమస్యలను సంబంధిత అధికారి ఎన్ని రోజులలో పరిష్కరించాలనే విషయమై స్పష్టమైన మార్గదర్శకాలు పొందుపరుస్తూ నిర్దిష్ట గడువు విధించారని అన్నారు.అధికారి పరిష్కరించిన భూ సమస్యపై అర్జీదారు సంతృప్తి చెందని పక్షంలో అప్పీలు వ్యవస్థను కూడా ఈ చట్టంలో పొందుపరిచారని తెలిపారు.సివిల్ కోర్టుకు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారికి,కలెక్టర్ కు అధికారాలు కల్పించారని,ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులను పునరుద్ధరించారని తెలిపారు.గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా భూ వివాదం ఉంటే సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని,భూభారతి చట్టంలో ఆ అవసరం లేకుండా రెండంచెల అప్పీల్ వ్యవస్థ ద్వారా సమస్యలు పరిష్కరించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు.అప్పీలు చేసుకున్న సన్న చిన్నకారు, పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని అన్నారు.గతంలో తహసిల్దార్ స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని అన్నారు.దీంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల వాటిని పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు.అధికార వికేంద్రీకరణ చేస్తూ భూభారతి ద్వారా కింది స్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని,దీనివల్ల అనేక సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు.భూ భారతిలో మ్యుటేషన్ దరఖాస్తులపై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు.వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకే రోజు ఉంటాయని అన్నారు.కొనుగోలు,దానం,తనఖా,బదిలీ,భాగం పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ క్షేత్రస్థాయిలో విచారించి రిజిస్ట్రేషన్ చేసి,హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని తెలిపారు.భూభారతిలో సెక్షన్ 8 ప్రకారం సివిల్ డిక్రీలు,లోకాయుక్త డిక్రీలు,ఇనాం భూములకు ఓ.ఆర్.సీలు తదితర వాటిని జారీ చేసే అధికారాలను ప్రభుత్వం ఆర్డీఓలకు కల్పించిందని కలెక్టర్ వివరించారు.భూ భారతి చట్టం ప్రకారం ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న గ్రామాలలో వాటిని ప్రదర్శించడం జరుగుతుందన్నారు.వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర,ఆబాది భూముల రికార్డులను కూడా తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తారని అన్నారు.భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో భూమికి భూదార్ సంఖ్య కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని,దీనివల్ల భూ ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు.అంతేకాకుండా భూముల సర్వే మ్యాప్ లను సమగ్ర వివరాలు,హద్దులతో పట్టా పాస్ బుక్కులలో పొందుపరుస్తారని అన్నారు.రైతులు లైసెన్స్ సర్వేయర్ ద్వారా సర్వే చేయించి భూముల మ్యాప్ ను సమర్పిస్తే, ప్రభుత్వ సర్వేయర్ పరిశీలించి దానిని పాస్ బుక్కుతో అనుసంధానిస్తారని తెలిపారు.ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు.భూ హక్కుల రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉంటే, భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.మే,జూన్ మాసాలలో గ్రామాల వారీగా నిర్వహించే రైతు సదస్సులలో అధికారులే గ్రామాలకు వచ్చి భూ సమస్యలు ఉన్న రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.ఈ నూతన చట్టంపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.ఇంకనూ ఈ చట్టంలో ఎలాంటి అంశాలు ఉంటే బాగుంటుందనే దానిపై సలహాలు కూడా అందించవచ్చని సూచించారు. ఈ సదస్సులలో నిజామాబాద్ ఇంచార్జి ఆర్డీఓ స్రవంతి, ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.కాగా, నిజామాబాద్ రూరల్ మండలానికి సంబంధించి గుండారం గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన సదస్సులో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని, భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు.

# పదిలో మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

- ఏర్గట్ల కేజీబీవీ పాఠశాలలో 15 మంది బాలికలకు 500ల పైనే మార్కులు...



-అనిషా బాను,మార్కులు 554, జడ్పి ఉన్నత పాఠశాల,ఏర్గట్ల..



-పెర్మండ్ల పూజిత, మార్కులు 549, జడ్పి ఉన్నత పాఠశాల,ఏర్గట్ల.ఖ



-బి.శ్రీనిధి,మార్కులు 550,కేజీబీవీ పాఠశాల,ఏర్గట్ల..



-ఎం.మనోజ్ఞ,మార్కులు 542,కేజీబీవీ పాఠశాల,ఏర్గట్ల..

**కబురు న్యూస్,ఏర్గట్ల,ఏప్రిల్ 30 :** ఏర్గట్ల మండలంలోని ఆరు జడ్పి ఉన్నత పాఠశాలలకు చెందిన అరవై ఏడు మంది బాలురు,యభై ఆరు మంది బాలికల నుంచి ఒక విద్యార్థి పరీక్ష రాయలేక పోవడంతో,మొత్తం నూట ఇరువై రెండు మంది నుంచి అరవై ఐదు మంది బాలురు,యాభై ఆరు మంది బాలికలు మొత్తం నూట ఇరువై ఒక మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఒక విద్యార్థి అనుత్తీర్ణత పొందడని మండల విద్యాధి కారి ఆనంద్ రావు తెలిపారు.500 పైన మార్కులు సాధించిన వారిలో ఏర్గట్ల జడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు బాలికలు,ఐదుగురు బాలూరులు,గుమ్మర్యాల్ జడ్పి ఉన్నత పాఠశాలలో నల్గురు బాలికలు,తొర్తి ఉన్నత పాఠశాల లో ముగ్గురు బాలూరులు,ఒక బాలిక,తాళ్ల రాంపూర్ ఉన్నత పాఠశాలలో ఒక బాలిక, తడపాకల్ ఉన్నత పాఠశాలలో నల్గురు బాలూరులు,ముగ్గురు బాలికలు,ఏర్గట్ల కే జీ బీ వీ పాఠశాలలో 23 మంది బాలికల్లో 15మంది బాలికలు ఐదు వందల పైన మార్కులు సాధించి సత్తా చూపారు.మండల వ్యాప్తంగా విద్యార్థులు 99.18 శాతం ఉత్తిర్ణత సాధించినట్లు ఏంఈవో తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్...



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 30 :** కేంద్ర కేబినెట్ త్వరలోనే జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.దాదాపు రెండు సంవత్సరాలుగా జనగణనలో బిసి గణను చేపట్టాలని బిసిటియు ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని,ఇప్పటికైనా బిసి లకు జన గణన తరువాత జనాభా దామాషా ప్రకారం విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పదవి విరమణ పొందిన సిబ్బందికి సన్మానించిన సీపీ




**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,ఏప్రిల్ 30 :** నిజామాబాద్ పోలీస్ శాఖలో పదవి విరమణ చేసిన పోలీసు అధికారులకు,సిబ్బందికి పోలీసు కమిషనర్ సాయి చైతన్య సన్మానించారు.వేల్పూర్ ఏఎస్సై యాదగిరి,జిల్లా పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా ఉన్న బాలకిషన్ లు బుధవారం పదవి విరమణ పొందగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సాయిచైతన్య శాలువలతో సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు సర్టిఫికేటు (జ్ఞాపికలతో) ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ,పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు.ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పక ఉంటుందని,మీరు డిపార్టుమెంట్ కు చేసిన సేవలు ఎంతో ఘనసీయమని పదవి విరమణ అనంతరము మీకు ఎలాంటి అవసరం వచ్చిన మీకు ఎల్లవేళల సహయపడుతామని,మీరు మీ కుటుంబ సభ్యులు అయురారోగ్యాలతో ఉండాలని,మీ పిల్లల భవిష్యత్తుభాగుండాలని ఆకాంక్షించారు.ఈ వీడ్కోలు కార్యక్రమంలో పోలీసు కార్యాలయం ఏవో అనిషా బేగం,ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్,బషీర్ అహ్మద్,వనజ మేడం,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్ పెక్టర్ శ్రీశైలం,సర్కిల్ ఇన్స్ పెక్టర్ వీరయ్య,రిజర్వు ఇన్స్ పెక్టర్ శేఖర్ బాబు,సతీష్,పదవి విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో విజయ్ పాఠశాల విద్యార్థుల విజయ దుందుభి





**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 30 :** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పది ఫలితాల్లో నిజామాబాద్ నగరంలోని ముబారక్ నగర్ విజయ్ పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు.2024-25 సంవత్సరానికిగాను పదో తరగతి పరీక్షల్లో 188 మంది విద్యార్థులు పరీక్షలు రాయాగా,వందశాతం ఉత్తీర్ణతను సాధించారనీ పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత తెలిపారు.వీరిలో ఇషిత 600 మార్కులకు 588 మార్కులు,యూనిస్ సోషన్ 587 మార్కులు,తనుశ్రీ 586 మార్కులు సాధించారని తెలిపారు. మిగితా 188 మంది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతే కాకుండా 600 మార్కులకు 158 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం గర్వకారణం అని అన్నారు.ఈ విజయం పాఠశాల ఉపాధ్యాయుల బృందం,విద్యార్థుల కృషి ఫలితమే అని కొనియాడారు.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు,వారికి తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయ బృందానికి,తల్లిదండ్రులకు ఆమె అభినందనలు తెలియజేశారు.

# పది ఫలితాలలో ప్రవేట్ పాఠశాలల దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- 100% రిజల్ట్స్ సాధించిన పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకేశ్వర్...
- 560/600 పైగా మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులు...
- అభినందించిన జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్...



-తోట రక్షిత 586/600..

**కబురు నిజామాబాద్,స్పోర్ట్స్ ఏప్రిల్ 30 :** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో ప్రవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్కులు సాధించారు.నిజామాబాదు జిల్లాలో ప్రభుత్వ,లోకల్ బాడీ పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించిన పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకేశ్వర్ విద్యారర్థిని తోట రక్షిత 586/600, డి. వైశాలి 582/600 మార్కులు సాధించి ఔరా అనిపించారు.ఈ పాఠశాల నుండి పరీక్ష కు 74 మంది విద్యార్థులు హాజరై 74 మంది ఉత్తీర్ణులై 100% సాధించారు.అందులో 20మంది విద్యార్థులు 560 పైగా మార్కులు సాధించడం ప్రభుత్వ పాఠశాలలో నిజంగా ఇది చరిత్ర సృష్టించడమే అవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్,గేజీటెడ్ ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్ తెలిపారు.ఉత్తమ ఫలితాలు సాధిందానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు,విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సింహాచలం ఘటన

**కబురు న్యూస్, విశాఖపట్టణం,ఏప్రిల్30:** విశాఖ జిల్లా సింహాచలం ఘటనలో మృతుల కుటుంబాలను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరామర్శించారు.. మధురవాడలోని చంద్రవరంకు చెందిన ఒకే కుటుంబంలో నలుగురు మృతిచెందడం విషాదాన్ని నింపింది.. ఆ కుటుంబాన్ని పరామర్శించి.. మృతదేహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన జగన్.. ఈ ఘటన దురదృష్టకరం అన్నారు.. అయితే, సింహాచలం ఘటనకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణం అని విమర్శించారు.. ఆరు రోజుల కిందట గోడ నిర్మాణం చేపట్టి రెండు రోజుల కిందట పూర్తి చేశారు.. చందనోత్సవం ఎప్పుడు జరుగుతుందో చంద్రబాబుకు తెలియదా ? చందనోత్సవానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలని చంద్రబాబుకు తెలియదా? అని నిలదీశారు.. సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగా ఏడుగురిని బలిగొన్నారని మండిపడ్డారు.. నాడు తిరుపతిలో వైకుంఠ ఏకాదశి ఘటన, నేడు విశాఖలో సింహాచలం ఘటన భక్తుల ప్రాణాలు బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఘటనలు జరిగిన తర్వాత కమిషన్ వేస్తానంటారు.. కానీ, ఎవరిపైన చర్యలు ఉండవు.. ఎందుకంటే చంద్రబాబే దోషి కనుక అన్నారు..

# స్మశాన వాటికకు పోయే దారిని కబ్జా విషయంపై నిరాహార దీక్ష

- సామాజిక కార్యకర్త శ్రీకాంత్ ను దీక్ష విరంపజేసిన పట్టణ సిఐ వరగంటి రవి తహసిల్దార్ రమేష్ బాబు






**కబురు న్యూస్,జమ్మికుంట ఏప్రిల్ 30:** -జమ్మికుంట మున్సిపల్ పరిధిలోగల 8వ వార్డులోని సర్వే నంబర్ 793/A/2, 793/B లో గల స్మశాన వాటిక దారి స్థలము కబ్జా విషయమై ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్ -రెవెన్యూ మరియు పోలీసుల హామీతో దీక్ష విరమణ -సంఘీభావం తెలిపిన సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీ, పోడేటి రామస్వామి, కొండ్లె పాపయ్య, మంద సాంబయ్య, పరిమెల కిషోర్ , మరియు వివిధ సామాజిక, ఉద్యమ, కుల సంఘాల ప్రతినిధులు ఈ సందర్భంగా సిలివేరు శ్రీకాంత్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఎం.పీ.ఆర్ గార్డెన్ సమీపాన ఉన్న హిందూ స్మశాన వాటికకు సంబంధించి ప్రజా ప్రయోజనార్థం ఉపయోగించే లక్షలాది రూపాయల విలువైన దారిని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసిన స్థలాన్ని కాపాడే ప్రయత్నంలో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినను సంబంధిత సమస్య విషయంలో ఎలాంటి చర్యలు లేనందున ఈరోజు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది. ఇట్టి దీక్ష విషయమై జిల్లా ఉన్నత అధికారుల ఆదేశానుసారం స్థానిక తహసిల్దార్ జి. రమేష్ బాబు మరియు స్థానిక పట్టణ సి.ఐ వరంగంటి రవి లు తమ సిబ్బందితో దీక్ష శిబిరం వద్దకు చేరుకొని సంబంధిత సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తూ బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ దీక్షను విరమింప చేయటం జరిగింది. ఈ సందర్భంగా దీక్షకు సంఘీభావం తెలియజేయడానికి వచ్చిన వారితో కలిసి సిలివేరు శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన హామీ మేరకు నిర్ణిత సమయంలో కబ్జాదారుల నుండి దారి స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటూ ప్రజలకు అందుబాటులోకి తెచ్చి సంబంధిత కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు చేపట్టని లేని యెడల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆమరణ దీక్షకు పూనుకోవటం జరుగుతుందని తెలియజేయడం జరిగింది.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సత్కరించిన సీపీ



**కబురు న్యూస్,గోదావరిఖని ఏప్రిల్ 30:** రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి నేడు ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యక్రమములో పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఇన్స్పెక్టర్ డి.కమలాకర్, ఏఆర్ఎస్ఐ ఎం.నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ ఎస్ సుందర్ రావు లను పోలీస్ కమిషనర్ పూలమాలలతో ఘనంగా సత్కరించడంతో పాటు, వారికి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనని, ప్రస్తుతం ఉద్యోగవిరమణ చేస్తున్న పోలీస్ అధికారులు వారి విధి నిర్వహణ సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవడంతో పాటు, కొన్ని సమయాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించి వీరు రేపటి తరం పోలీసులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని ఉద్యోగవిరమణ చేసిన పోలీసు అధికారులు తమ ఆరోగ్యం కోసం నిరంతరం యోగ లేదా వ్యాయామాన్ని కొనసాగించడంతో పాటు, వారి కుటుంబ సభ్యులతో సమయాన్ని కేటాయించాలని సుఖ సంతోషాలతో, ఆనందంగా జీవితం గడపాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఐపిఎస్., పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, ఏఓ శ్రీనివాస్, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్ల కుంట పోచలింగంతో పాటు పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు వారి బంధుమిత్రులు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో కృష్ణవేణి విద్యార్థుల విజయకేతనం





**కబురు న్యూస్,గోదావరిఖని ఏప్రిల్ 30:** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కృష్ణవేణి విద్యాసంస్థలలో బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు 578/600బీ 571/600బీ 568/600బీ 568/600, 550-600 మార్కులు 20 విద్యార్థులు, 500-549 మార్కులు 78 మంది విద్యార్థులు, 450-499 మార్కులు 53 మంది విద్యార్థులు, 400-449 మార్కులు19 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో చరిత్ర తిరగ రాయడం అంటే అది కృష్ణవేణి విద్యా సంస్థకే సాధ్యం అని చెబుతూ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం చాలా సంతోషకరం అని తెలియజేస్తూ, విద్యార్థుల చదువు కోసం అహర్నిశలు కష్టపడినటు వంటి కృష్ణవేణి విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, రామకృష్ణ, సత్యనారాయణ, శైలజ, ఉపాధ్యాయ బృందంను అభినందించారు.

# ఎస్ఎస్సి ఫలితాల్లో విశ్వ భారతిదే అగ్రస్థానం:

- ఎస్ఎస్సి ఫలితాలలో విశ్వ భారతి విద్యాసంస్థల విజయ దుందుబి:
- విశ్వభారతి అధినేత బంధారపు యాదగిరి గౌడ్:






















**కబురు న్యూస్,రామగుండం ఏప్రిల్ 30:** ఎస్ఎస్సి ఫలితాలలో విశ్వభారతి విద్యాసంస్థలు విజయ దుందుబి మ్రోగించాయి. రామగుండం, ఎన్టీపీసీ విశ్వభారతి, నవోదయ , సెయింట్ జోసెఫ్ పాఠశాలల విద్యార్థులు ఈ సంవత్సరం రాసిన ఎస్ఎస్సి పరీక్షల్లో అగ్రస్థానంలో నిలిచారు. ఎం జశ్వంత్ 582 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. ఇంకా 564 వి చరణ్ 559 ఈ రాజుకుమార్, టీ.కావ్యా 558, సహిష్ట 557,ఎల్ వర్ధన్ 556, బి నాగధీరాజ్ 552 , ఎం బాలకృష్ణ రెడ్డి 527 మార్కులు సాధించారు. మొత్తం మీద పాఠశాల విద్యార్థులు 38 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించి ఈ ప్రాంతంలో మొదటి స్థానాన్ని ఆక్రమించారు. మొదట నుంచి ఒక ప్రణాళికాబద్ధంగా అందరు టీచర్స్ టీం వర్క్ గా కృషి చేయడం వల్ల పేరెంట్స్ అందరు సహకరించడం వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధించామని పాఠశాలల చైర్మన్ బంధారపు యాదగిరి గౌడ్ తెలిపారు. మూడు పాఠశాలల్లో 100% రిజల్ట్స్ సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులను తల్లిదండ్రులను పాఠశాల ఉపాధ్యాయులను చైర్మన్ యాదగిరి గౌడ్ ,హెడ్మాస్టర్ తిరుపతి గౌడ్ ,ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ అభినందించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష




**కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 30:** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన 15 మందిని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరిచారు. వారికి రూ.28 వేల జరిమానా విధించారు. రెండవసారి పట్టుబడిన గాదె సమ్మయ్యకు మూడు రోజుల జైలు శిక్ష విధించారు. పట్టణ ప్రజలకు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుపడితే జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు జి.హరి శేఖర్, బి.సంతోష్ కుమార్, ఎన్. రామరాజు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# పదోన్నతి పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి



- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి..

**కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 30:** పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఏ.ఎస్.ఐగా విధులు నిర్వహిస్తూ ఎస్ఐలుగా పదోన్నతి పొందిన సయ్యద్ మజారొద్దీన్, అబ్దుల్ మున్నిర్ అహ్మద్, ఏం.రాజన్న, ఆర్.బిక్ లాల్ లను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వారి కార్యాలయంలో అభినందింఛి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పోలీస్ అధికారులతో మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ అన్నారు. వీలైంత వరకు చట్ట పరిధిలో ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని, పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు పెరిగే రీతిలో ప్రజలతో వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

- ఎస్సారెస్పీ ఈఈ శశిభూషణ్



**కబురు న్యూస్,-హుజురాబాద్ ఏప్రిల్ 30:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, విరమణ అనంతరం కుటుంబాలతో ఆనందంగా జీవించాలని ఎస్సారెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) శశి భూషణ్ అన్నారు. ఎస్సారెస్పీ హుజురాబాద్ సబ్ డివిజన్-2 పరిధిలో ఉమెన్ మజ్దూర్ గా పనిచేసిన పర్వీన్ ఏప్రిల్ 30న పదవి విరమణ పొందారు. కాగా బుధవారం పర్వీన్ ఆత్మీయ వీడుకోలు సమావేశాన్ని కెసి క్యాంపు లోని డిఈ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈఈ శశిభూషణ్ మాట్లాడుతూ.. విశ్రాంత జీవితంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపడంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదవి విరమణ కేవలం వృత్తికే కానీ వ్యక్తిత్వానికి, మనసుకు కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ లు వెంకట రామ వరప్రసాద్, రాము, రవీందర్, డీఏఓ నాగయ్య, ఏఈ రతీశ్, సహచర ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి పేరు నిలబెట్టిన తనయుడు...




**కబురు న్యూస్, జమ్మికుంట :30** ఏప్రిల్ తండ్రి ఒక నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కాగా, తన తండ్రి బాధలు, తన తండ్రిని గర్వించే విధంగా తన తనయుడు కష్టించి, చదువును ఇష్టపడి ఎన్నో ఒడిదుడుకుల నడుమ తండ్రి పేరును ఒక అంగుళం పెంచిన తనయుడు గదా.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో చోటు చేసుకుంది. జమ్మికుంట మున్సిపాలిటీ కార్యాలయంలో గత 25 సంవత్సరాలుగా చాలిచాలని వేతనంతో జీవిస్తున్న తన తండ్రి బాధను, తన బాధగా గుర్తించి సోహెల్ పదోవ తరగతి పరీక్ష ఫలితాలలో 600 మార్కులకు గాను 570 మార్కులు సాధించడం పట్ల మున్సిపల్ కార్యాలయ కమిషనర్ మహమ్మద్ అయాజ్ తో పాటు తాజా మాజీ ఛైర్మెన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, కాంగ్రెస్ నేత ప్రణవ్ లు విద్యార్థి తండ్రి పాషను అభినందించారు.

# వక్ఫ్ సవరణ చట్టంను రద్దు చేయాలి..

- ముస్లిం మైనారిటీల హక్కుల సాధన కోసం RPV శాంతి ఉద్యమం..
- రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ కార్యక్రమానికి మద్దతుగా భారీ మోటార్ సైకిల్ ర్యాలీ..








**కబురు న్యూస్,ఖమ్మం ఏప్రిల్ 30:** కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం 2025 ను తీసుకువచ్చి ముస్లింల హక్కులను కాల రాసిందనీ రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ( RPV ఫౌండర్ ) సయ్యద్ సాధిక్ అలి ఆరోపించారు.. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశానుసారం వారికి మద్దతుగా తన నిరసనను తమ సంస్థ చేపట్టిందని అన్నారు.. ముస్లిం మైనార్టీల పట్ల వివక్షతను చూపుతూ ముస్లిం మైనార్టీలను విభజించి పాలించే నైజాన్ని కేంద్ర ప్రభుత్వం అనేక ఏళ్లుగా ప్రదర్శిస్తూ వస్తుందని ఆయన ఆరోపించారు..ముస్లింల ఐక్యతను చాటుతూ.. మనమంతా హమ్ సబ్ ఏక్ హై... అంటూ.. ముస్లిం యువత పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి.. కేంద్రం తీసుకు వచ్చిన నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ కార్యక్రమాలకు మద్దతుగా ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్ ప్రాంతంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా శాంతి యుత నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లి పాదాల కింద స్వర్గం ఉందని ఖురాన్ గ్రంథం చెబుతుందని, ఇంటికి దీపం ఇల్లాలు అనే నానుడి వున్న నేపధ్యంలో మాతృమూర్తికి సేవలు, సతీమణి పట్ల బాధ్యతలే తెలియని వారికి భారత దేశంలో ఉన్న 140 కోట్ల ప్రజల బాధలు ఎలా తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. మతేతర రాజ్యంలో మంటలు రేపుతూ..ప్రతినిత్యం మతాల మధ్య చిచ్చు పెడుతూ.. విద్వేషాలను రెచ్చగొడుతూ కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తూ.. రాజ్యాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి ముస్లిం మైనార్టీల పట్ల చిన్నచూపు చూస్తూ.. పైశాచిక ఆనందం పొందుతుందన ఆయన ఆరోపించారు.. ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం, నల్ల చట్టాల రద్దు కోసం ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన తమ శాంతి మార్గ నిరసనను రాబోవు రోజుల్లో దేశ రాజధాని హస్తినలో గల జంతర్ మంతర్ ప్రాంతాన్ని ముట్టడించే వరకు విశ్రమించేది లేదని ఆయన హెచ్చరించారు.... వక్ఫ్ భూములు ఏ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు చెందినవి కావని, భారతదేశానికి స్వాతంత్రానికి ముందు ఆనాటి రాజులు దేవుడు మాన్యాల కోసం పీర్ల చావిడి, దర్గా, మసీదు నిర్మాణాల కోసం దాతలు ఇచ్చిన భూములను లాక్కునే హక్కు కానీ, అందులో చైర్మన్, సభ్యుల పేర్ల ద్వారా పదవుల రంగ ప్రవేశం చేసే హక్కు కానీ ఏ ఒక్కరికి లేదని ఆయన విమర్శించారు.. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ ఆలోచనను విరమించుకోవాలని లోక్ సభ, రాజ్యసభలో అమలు జరిపిన వక్ఫ్ సవరణ చట్టం 2025ను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం దేశవ్యాప్త ఉద్యమాలను గాంధేయ మార్గంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.. తాను పిలుపునిస్తే తక్కువ ముస్లిం మైనార్టీ యువత స్వచ్ఛందంగా తరలి వచ్చారని, వారందరికీ తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన అన్నారు.. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి 9 గంటలకు నల్ల చట్టానికి నిరసనగా తమ తమ నివాస, వాణిజ్య సముదాయాలు వద్ద 10 నిమిషాల పాటు విద్యుత్ లైట్లను ఆర్పుతూ.. తెలిపే నిరసనకు మద్దతుగా బుధవారం ఖమ్మంలోని RPV రాష్ట్ర కార్యాలయం వద్ద భారీ మోటార్ సైకిల్ ర్యాలీని జరిగింది.. ముస్లిం మైనారిటీ యువత తమ కుడి చేతికి నల్ల బ్యాడ్జి ధరించి... మోటారు సైకిల్ ర్యాలీలో పాల్గొనగా ఈ ర్యాలిని సంస్థ ఫౌండర్ సయ్యద్ సాదిక్ అలీ ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు..ఈ ర్యాలీ ఖమ్మం నగరంలో వరంగల్ క్రాస్ రోడ్స్ నుంచి ప్రారంభమైన మోటార్ సైకిల్ ర్యాలి కాల్వ ఒడ్డు, మయూరిసెంటర్ పాత ఎల్ ఐ సి మీదుగా జడ్పీ సెంటర్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలు, ప్ల కార్డులు చేతబూని వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గం బాధ్యులు డాక్టర్ నజీర్.. రూరల్ మండలం నాయకులు హుస్సేన్ ఇబ్రహీం సోను యాకూబ్ పాషా కుమార్ ఆరిఫ్ తండా హుసేన్ అన్వర్ అబ్దుల్ షాహిద్ షరీఫ్ మోను కాసిం కాజల్ భాష మదర్,59వ డివిజన్ ఆయేషా సిద్ధికి దానవాయిగూడెం నాయకులు రంజాన్ ఇబ్రహీం ఇష్తి కార్ ఆసిఫ్ అఫ్సర్, నాయుడుపేట ప్రాంత నాయకులు ఇబ్రహీం ఖాన్ అబ్బాస్ సోందు అజార్ ఖాసిం, తిమ్మాపురం మండలం నాయకులు సయ్యద్ ద్ బషీర్ , అక్సర్, సుభాన్ , గౌస్మియా మీరా, సైదా మల్సూర్ , బాబు, షబ్బీర్, మీరా, బాబా, సైఫ్, తదితరులు పాల్గొన్నారు..

## కార్మికుల శ్రమే అభివృద్ధికి మూలస్తంభం -మాజీ ఎంపీ నామ



**కబురు న్యూస్,ఖమ్మం ఏప్రిల్ 30:** అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం (మే డే) సందర్భంగా బిఆర్ఎస్ మాజీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు కార్మిక కుటుంబాలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మీడియా కు ఒక పత్రిక ప్రకటన విడుదల చేసారు. కార్మికులు దేశ నిర్మాణ శిల్పులని వారి శ్రమ లేకుండా అభివృద్ధి అసాధ్యమని పేర్కొన్నారు. కార్మికులు పని చేసే ప్రతిచోటా వారి వంతు శ్రమ, అంకితభావం నిండి ఉందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణవాయువులా పనిచేసే ఈ వర్గాన్ని గుర్తించి, వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పదిహేను, పదిహేడవ లోక్ సభల్లో తాను కార్మికుల హక్కుల కోసం, సింగరేణి సమస్యలు పైన లోక్ సభలో మాట్లాడటం జరిగిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మికుల కోసం అనేక అభివృద్ధి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే అసంగటిత రంగ కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కల్పించి వారికి సహాయం చేసే విధంగా నాడు అనేక కార్యక్రమాలు చేపట్టడం గర్వించదగిన విషయం అని పేర్కొన్నారు. ఇప్పటికీ పలు రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి అవసరమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.కార్మికుల పట్ల ఉన్న అసమానతలు తొలగించేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమని, కార్మికుల శక్తిని గౌరవించడమే నిజమైన అభివృద్ధికి నాంది అని అన్నారు. దేశ అభివృద్ధికి జీవనాధారమైన వారిని గౌరవించడం, వారికో భద్రమైన జీవితం కల్పించడం తో పాటు వారి జీవితాల్లో వెలుగు నింపాల్సిన అవసరం ఉందని అని నామ స్పష్టం చేశారు.

## పది ఫలితాల్లో 'సూర్యా సక్సెస్ స్కూల్ ' విద్యార్థుల ప్రభంజనం

**కబురు న్యూస్,ఖమ్మం ఏప్రిల్ 30:**



బుధవారం విడుదలైన తెలంగాణ పదవ తరగతి ఫలితాల్లో ఖమ్మం నగరానికి చెందిన సూర్య సక్సెస్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 2024 - 25 సంవత్సరానికి 100% ఫలితాలను సాధించారు.
వై సాత్విక్ 600/554, షేక్. సోహెల్ 600/546, ఫణీంద్ర 600/545, గీత శ్రీ 512, సూఫీ ఐమాన్ 500, తో పాటు మిగిలిన విద్యార్థులకు 450కి పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు 100కు 100% ఉత్తీర్ణత సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. పాఠశాల ప్రారంభించిన నాటినుండి నేటి వరకు తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అందరూ ఉన్నత శ్రేణి మార్కులతో విజయం సాధిస్తున్నారని, వారి విజయం వెనక పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల కృషి కూడా ఎంతో ఉందని ఆయన అన్నారు. క్రమశిక్షణ, డెడికేషన్, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయుల చేత తమ పాఠశాలలో విద్యాబోధన జరుగుతోందని, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ సొంత పిల్లల వలె చూసుకుంటూ, విద్యనందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. తమ పాఠశాల విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కావడం లేదని, సంస్కృతిక కార్యక్రమాలతో పాటు, సాంకేతికపరమైన విద్యను కూడా తమ పాఠశాలలో నేర్చుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సన్మానించి, స్వీట్లు పంచిపెట్టారు. ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారికి విద్యనందించిన ఉపాధ్యాయులతో పాఠశాల ఆవరణమంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దాసు, వెంకటేశ్వర్లు, నిఖత్, ఇన్చార్జులు కలియర్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# రెజొనెన్స్-శ్రీనగర్ విద్యార్థుల విజయకేతనం







**కబురు న్యూస్,ఖమ్మం ఏప్రిల్ 30:** స్థానిక శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్ 2024-25 సంవత్సరానికి గాను యస్.యస్.సి.ఫలితాలలో విద్యార్థులు అత్యద్భుత ప్రతిభను కనబరిచి 578 అత్యధిక మార్కులతో పాటు అత్యుత్తమ ఫలితాలను సాధించి సత్తా చాటారు. రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ కాలనీ యందు యస్.యస్.సి. ఫలితాలలో విద్యార్థుల అత్యుత్తమైన ప్రతిభ కనబరిచారు. 1) యండి.సుమయ ఫిర్దౌస్, 578/600, 2) డి.రుష్విణి, 577/600, 3) బి.ప్రతిభ, 575/600, 4) కె.గాయత్రి తన్విష, 574/600, 5) యస్కె.అష్రఫ్, 573/600, 6) డి.శ్రీవల్లి, 573/600, 7) సిహెచ్.హాసిని, 572/600, 8) కె.ప్రణవ్, 571/600లు సాధించారు. 550పైగా 15, 540పైగా 28, 520పైగా 40, 500పైగా 57లతో పాటు అత్యుత్తమ ఉత్తీర్ణత మరియు మంచి మార్కులను సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించి ఆశీర్వదించడం జరిగింది.

అభినందన కార్యక్రమములో పాఠశాల డ్కెరెక్టర్ కొండా శ్రీధర్‌రావుగారు మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన మరియు ఉత్తీర్ణులైన విద్యార్థులందరిని అభినందించి వారు భవిష్యత్తులో అత్యున్నతమైన శిఖరాలను అధిరోహించి విజయ దుందుభి మోగించాలని ఆశీర్వదించి, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో మంచి ప్రణాళికతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తుతో పాటు ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా బోధన చేపిస్తూ తిరుగులేని విద్యాసంస్థగా నిలిచిందని తెలియజేసారు.

పాఠశాల డ్కెరెక్టర్ కొండా కృష్ణవేణి గారు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించి రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ ఉత్తమ ఫలితాలతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్దే ధ్యేయంగా నూతన ఆవిష్కరణలకు ముఖద్వారంగా ఉంటూ విద్యార్థులలో మంచి క్రమశిక్షణ, నైపుణ్యాలను పెంపొందిస్తుందని తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు తల్లిదండ్రులు పాల్గోని విద్యార్థులను అభినందిచారు..

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి







**కబురు న్యూస్,ఖమ్మం ఏప్రిల్ 30:** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో బుధవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా మధిర నియోజకవర్గం చింతకాని మండలం కొదుమూరులో జరిగిన కన్నేటి సురేష్ వివాహానికి, ఖమ్మం నియోజకవర్గం మేకల బిక్షమయ్య నగర్ లోని ఎంబి గార్డెన్స్ , పాలేరు నియోజకవర్గం వెంకటగిరి క్రాస్ రోడ్డులోని శ్రీ హర్ష కన్వెన్షన్, దానవాయిగూడెంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్, కస్నా తండాలో తెల్లబోయిన రత్నాకర్ వివాహ వేడుకకు, రెడ్డిపల్లిలోని అమ్మ ఫంక్షన్ హాల్లో జరిగిన ఓ వివాహ వేడుకకు అదేవిధంగా కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం

**కబురు న్యూస్,ఖమ్మం ఏప్రిల్ 30:** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు



అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

**ఉద్యోగ విరమణ పొందిన వారు**
ఎమ్ దానయ్య ఎస్సై పిసిఆర్



ఖమ్మం.కె.నాగరాజు ఏఎస్ఐ ఖమ్మం త్రీ టౌన్ పిఎస్.జే కాంచన దేవి ఎల్జి ఎస్ ( సీపీ కార్యాలయం) ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా & ఆర్డర్ ప్రసాద్ రావు, ఆర్ ఐ కామరాజు,పోలీస్ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షుడు వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# లైక్స్ కోసం ఏదైనా రాసేస్తారు.. - మౌనీరాయ్



కబురు సినిమా ఏప్రిల్ 30:
ఇటీవల తన కొత్త సినిమా ప్రచారంలో భాగంగా జరిగిన ఈవెంట్‌లో నటి మౌనీరాయ్ న్యూలుక్‌లో కనిపించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె అందం కోసం శస్త్రచికిత్స చేయించుకున్నారని ప్రచారం జరిగింది. ఈ లుక్‌లో కొన్ని ఏఐ వీడియోలను కూడా క్రియేట్ చేసి షేర్ చేశారు. తాజాగా దీనిపై మౌనీరాయ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటివి ప్రచారం చేసేవారిని చూస్తే జాలి వేస్తుందన్నారు.

“నా లుక్‌పై వచ్చిన ఎన్నో ఏఐ వీడియోలు చూశాను. అవి భయంకరంగా ఉన్నాయి. నా ముఖాన్ని వేరొకరి శరీరానికి అతికించారు. ఆ వీడియోలు చూడడానికి కూడా చాలా అసహ్యంగా ఉన్నాయి. ఇలాంటివి క్రియేట్ చేయడం వల్ల వారికి ఎలాంటి ఆనందం వస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కాదు. వారి లక్ష్యం ఏమిటనేది తెలియదు. ఇలాంటివారు ఎవరిలోనూ మంచిని చూడలేరు. నేను సోషల్ మీడియాను ఉపయోగించడం ప్రారంభించిన తొలినాళ్లలో నెగెటివ్ కామెంట్స్ చేసేవారి ప్రొఫైల్ ఓపెన్ చేసి వారి గురించి తెలుసుకొని బ్లాక్ చేసేదాన్ని. ఇప్పుడు ఇలాంటి వారిని చూస్తే జాలి వేస్తోంది. వారికి సరైన బుద్ధిని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తాను. వారి లైక్‌ల కోసం సెలబ్రిటీలపై చెత్త సమాచారమంతా రాస్తారు” అని అసహనం వ్యక్తం చేశారు.ప్రస్తుతం మౌనీరాయ్ ‘ది భూత్నీ’ ప్రచారంలో బిజీగా ఉన్నారు. సంజయ్‌దత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు సిద్ధాంత్ సచ్‌దేవ్ దర్శకత్వం వహించారు. మే1న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తనకు చాలా ప్రత్యేకమని మౌనీ ఇటీవల ఓ కార్యక్రమంలో తెలిపారు. ఇందులోని స్టంట్స్ కోసం డూప్స్‌ను ఉపయోగించలేదని.. తానే స్వయంగా చేశానని చెప్పారు.



# నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది: భార్యపై ప్రశంసలు కురిపించిన అజిత్

కబురు సినిమా ఏప్రిల్ 30:
తాజాగా పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ . ఈ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని.. ఇది తనకు ప్రేరణగా నిలుస్తుందని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సందర్భంగా తన భార్య షాలినిపై ప్రశంసలు కురిపించారు. ఆమె ఎన్నో త్యాగాలు చేసినట్లు చెప్పారు.“నేను ఇప్పటికీ సామాన్యుడిలానే ఆలోచిస్తాను. ఇంతటి విజయాన్ని సాధించినందుకు ఒక్కోసారి ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది. ఈ స్థాయిలో ఉండడానికి నా భార్య షాలినినే కారణం. ఆమె నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది. ప్రతి పనిలోనూ నాకు తోడుంటుంది. ఒక్కోసారి నేను సరైన నిర్ణయాలు తీసుకోకపోయినా ఆమె అండగా నిలిచింది. నన్ను ఎప్పుడూ నిరుత్సాహ పరచలేదు. నా కష్ట సమయాల్లో పక్కనే ఉండి భరోసానిచ్చింది. నా జీవితంలో సాధించిన సక్సెస్ క్రెడిట్ అంతా ఆమెకే ఇస్తాను. ఎంతో ప్రజాదరణ పొందిన నటి అయినప్పటికీ నాకోసం అన్నిటికీ దూరమైంది. ఆమెకు ఎంతోమంది అభిమానులు ఉన్నారు. వారందరికీ కూడా నేను ఈసందర్భంగా కృతజ్ఞతలు చెబుతున్నాను” అని చెప్పారు.“నేను కేవలం నటుడిని. నటన నాకు జీతాన్నిచ్చే ఓ ఉద్యోగంగా భావిస్తాను. సూపర్‌స్టార్ అని పిలిపించుకోవడం నచ్చదు. ఎందుకంటే అలాంటి ట్యాగ్స్‌పై నాకు నమ్మకం లేదు. 33 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. నా వృత్తిని ప్రేమిస్తాను. జీవితమంతా అభిమానులను అలరించడానికే ప్రయత్నిస్తాను. సాధ్యమైనంతవరకూ సాదాసీదాగా ఉంటాను. అతిగా ఆలోచించను. ఒకేసారి ఎక్కువ ప్రాజెక్ట్‌లు అంగీకరించను. నటనతో పాటు నా ఇతర ఆసక్తులపై కూడా దృష్టిపెడతాను” అని అజిత్ తెలిపారు.

# పబ్లిసిటీ గురించి అసలు పట్టించుకోను - వెంకటేశ్




కబురు సినిమా ఏప్రిల్ 30:
రజనీకాంత్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు స్టార్ హీరో వెంకటేశ్. ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆధ్యాత్మిక ప్రయాణం గురించి చెప్పారు. అలాగే తాను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు రజనీకాంత్ ఓ సలహా ఇచ్చారని అప్పటినుంచి ఇప్పటివరకూ ఆ సలహానే పాటిస్తున్నానన్నారు.“రజనీకాంత్‌కు, నాకు ఇద్దరికీ ఆధ్యాత్మిక భావాలు ఎక్కువ. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. మా నాన్నతో కలిసి ఆయన వర్క్ చేశారు. నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఒక మాట చెప్పారు. సినిమా రిలీజ్ సమయంలో బ్యానర్లు కట్టారా? పోస్టర్‌లలో మన ముఖం బాగా కనిపిస్తుందా? మ్యాగజైన్ ఫ్రంట్ పేజ్‌లో మన ఫొటో వేశారా? ఇలాంటి వాటి గురించి ఆలోచించొద్దన్నారు. మన పని మనం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. అప్పటినుంచి ఇప్పటివరకూ అదే సలహాను పాటిస్తున్నాను. పబ్లిసిటీ గురించి పట్టించుకోను. దేని గురించి ఎక్కువగా ఆలోచించను” అని వెంకటేశ్ చెప్పారు.ఇక ఇదే ఇంటర్వ్యూలో వెంకటేశ్ తనకు అరుణాచలం అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. రమణ మహర్షిని ఆరాధిస్తానని తెలిపారు. చిన్నప్పటినుంచి ఆధ్యాత్మిక భావాలు ఎక్కువేనని చెప్పారు. దేవుడంటే భయం ఎక్కువని.. భగవంతుడికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు చదివినట్లు తెలిపారు. ‘ఘర్షణ’ సమయంలో తాను ప్రయాణిస్తున్న పడవ మునిగిపోయిందని దేవుడి దయతోనే ఎలాంటి ప్రమాదం జరగకుండా బయటపడినట్లు చెప్పారు.

# జాక్ పాట్ కొట్టింది.. అల్లు అర్జున్ కి జోడీగా దేవరకొండ హీరోయిన్!



కబురు సినిమా ఏప్రిల్ 30:
గ్లామర్ రోల్స్‌తోనే కాదు నటనకు ప్రాధాన్యత గల పాత్రలతోనూ మెప్పించగలనని నిరూపిస్తోంది అనన్య పాండే. అక్షయ్ కుమార్ హీరోగా ఇటీవల వచ్చిన ‘కేసరి 2’చిత్రంలో ఆమె కీలకపాత్ర పోషించింది.ఇందులో తన నటన చూసిన వాళ్లంతా ప్రశంసలు కురిపిస్తున్నారు. గతంలో తన నటనను విమర్శించిన వాళ్లు కూడా ఇప్పుడు తన పెర్ఫార్మెన్స్‌కు ఫిదా అవుతున్నారు.ఇదిలా ఉంటే అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కబోయే క్రేజీ ప్రాజెక్ట్‌లో అనన్య నటించబోతోందని సమాచారం. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.ఇందులో ముగ్గురు హీరోయిన్స్ నటించాల్సి ఉండగా ఇప్పటికే జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్‌లను ఎంపిక చేశారని, మరో హీరోయిన్‌గా అనన్యపాండే నటించనుందనే ప్రచారం జరుగుతోంది.గతంలో విజయ్ దేవరకొండకు జంటగా ‘లైగర్’లో నటించగా, ఆ సినిమా పరాజయం పాలవడంతో తీవ్ర నిరాశ ఎదురైంది. కొంత గ్యాప్ తర్వాత మళ్లీ ఇప్పుడు మరో టాలీవుడ్ స్టార్‌తో నటించే అవకాశం వచ్చింది.ఇటీవల బాలీవుడ్‌లో వరుస చిత్రాలతో మెప్పిస్తున్న అనన్య.. ఈ సినిమాతో సౌత్‌లోనూ సత్తా చాటే అవకాశం ఉంది. మరి అనన్య ఎంపిక కేవలం ప్రచారమేనా లేక హీరోయిన్‌గా కన్ఫర్మ్ చేస్తారో చూడాలి!

# ‘పెద్ది’.. బరిలోకి మళ్లీ అప్పుడే!



కబురు సినిమా ఏప్రిల్ 30:
కథానాయకుడు రామ్‌చరణ్.. దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా.. తదుపరి షెడ్యూల్‌ను మే రెండో వారంలో ప్రారంభించుకోనున్నట్లు సమాచారం. ఈలోగా చరణ్ మే 9న లండన్ టుస్సాడ్స్‌లో జరిగే తన మైనపు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలోనూ.. 11న రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో జరగనున్న ‘ఆర్ఆర్ఆర్’ రాయల్ ఫిల్హార్మోనిక్ లైవ్ కన్సర్ట్‌లోనూ పాల్గొననున్నారు. ఈ వేడుకలో చెర్రీతో పాటు ఎన్టీఆర్, రాజమౌళి, కీరవాణి సందడి చేయడమే కాక ప్రీ-ఫిల్మ్ టాక్‌లో భాగంగా ప్రేక్షకులతోనూ ముచ్చటించనున్నారు. మే 14తర్వాత రామ్‌చరణ్ మళ్లీ ‘పెద్ది’ చిత్రీకరణ కోసం సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు తెలిసింది. ఇది ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే బలమైన భావోద్వేగాలు నిండిన క్రీడా నేపథ్య చిత్రంగా ముస్తాబవుతోంది. దీంట్లో చరణ్ ఆట కూలీగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com